క్లుప్తంగా

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

రంగంపేట: విశ్వహిందూ పరిషత్, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కోటపాడులో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 500 బైక్‌లతో కోటపాడు, వెంకటాపురం, సుభద్రంపేట, రంగంపేట తదితర గ్రామాల మీదుగా భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ భజరంగ్ అధ్యక్షుడు వరప్రసాద్, సాయిరాం, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా రుద్రాభిషేకం



కొంకుదురులో ప్రత్యేక అలంకరణలో త్రిముఖలింగేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడతల మామిడి వద్ద కొలువైన శ్రీబాల త్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా ఆవు పాలు, పెరుగు, నెయ్యి, పంచదార, గంధం, వివిధ రకాల పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పందలపాక గౌరీశంకర ఆలయంలోను స్వామివారికి మహా రుద్రాభిషేకం చేశారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో సూర్యదేవునికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయంలో మాఘమాసం ఆదివారం కావడంతో సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యుల ఆధ్వర్యంలో ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్య నారాయణమూర్తి స్వామికి పండితులు విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కన్నుల పండువగా చంద్రశేఖరస్వామి కల్యాణం



కల్యాణం సందర్భంగా కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడులో కొలువై ఉన్న కాత్యాయనీదేవి సమేత చంద్రశేఖరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కూచిపూడి నత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఎమ్మెల్యే జక్కంపూడి పరామర్శలు



కొండగుంటూరులో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజా

రాజానగరం: వివిధ కారణాలతో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదివారం పరామర్శించారు. మండలంలోని పల్లకడియంలో నానమ్మను కోల్పోయిన పాతూరి శ్రీను కుటుంబాన్ని, కొండగుంటూరులో సుంకర పాపమ్మ, యంత్రపాటి మంగాయమ్మ, డి.లాజరు కుటుంబాలను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

యువతి అదృశ్యం

రాజానగరం: సీతానగరం మండలం శ్రీరామనగర్‌కి చెందిన 20 సంవత్సరాల యువతి అదృశ్యమైంది. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో పరిసరాలన్నీ గాలించిన తండ్రి షేక్ జైన్ ఆచూకీ కోసం పోలీసులను ఆశ్రయించాడు. వెలంపేటకు చెందిన మణికంఠ అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీతానగరం ఎస్సై శుభోఖర్ తెలిపారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

- గ్రామాల్లో కనిపిస్తున్న ఆటలమ్మ, గవద బిళ్లల కేసులు
- పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



చికెన్ పాక్స్ నమునా ఫొటో



గవద బిళ్లల నమునా ఫొటో

బిక్కవోలు: వేసవి కాలం ప్రారంభమైతే చాలు చికెన్ పాక్స్(ఆటలమ్మ), గవద బిళ్లల సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తోంది. మార్చి నెలలోకి అడుగు పెట్టకముందే ఎండలు మండుతున్నాయి. మరో వైపు ఇప్పటికే గ్రామాల్లో చికెన్ పాక్స్, గవద బిళ్లల సమస్య కనిపిస్తోంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. అన్నివయసుల వారికి ఈ అంటువ్యాధులు సోకే అవకాశమున్నా ప్రధానంగా చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్తలతోనే అంటువ్యాధుల బారిన పడకుండా చూసుకోవొచ్చని సూచిస్తున్నారు.

అనపర్తి నియోజవర్గంలో పదేళ్ల లోపు చిన్నారులు సుమారు 30 వేల మంది ఉన్నారు. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఆటలమ్మ, గవద బిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచన మేరకు యాంటీవైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకినవారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలే ఇవ్వడం మంచిది. గవదబిళ్లలు వచ్చినవారికి గొంతు నొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. చికెన్ పాక్స్, గవద బిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢనమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందంటున్నారు. అసలు ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరు వెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని సూచిస్తున్నారు.

వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యలతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ పులగం రామానంద సాగర్, చిన్నపిల్లల నిపుణులు, అనపర్తి

మూఢ నమ్మకాలొద్దు



వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. మూఢ నమ్మకంతో వైద్యం అందించకపోతే ప్రమాదం. ఎక్కువ ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది. వ్యాధి తగ్గే వరకూ వైద్యుల సలహాలు పాటించాలి.

– డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి, పందలపాక

గృహ సారథులు.. సంక్షేమ వారధులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గృహ సారథులే పార్టీ రథ వారధులు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో మండల పరిధిలోని గృహసారథులకు శిక్షణ, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి–ప్రజలకు వారధులైతే, గృహసారథులు పార్టీకి–ప్రజలకు సంక్షేమ వారధులన్నారు. సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థ ద్వారా కుల, మత, రాజకీయలకు అతీతంగా అర్హులకు నేరుగా సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని చెప్పారు. అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వనీయకుండా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన కుటిల యత్నాలతో ఎలా అడ్డుకుంటున్నారో ప్రజలకు తెలియజెప్పాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయ ఢంకా మోగించేలా గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల కలిగే ప్రయోజనాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, రామవరం ఎంపీటీసీ నల్లమిల్లి భాగ్యలక్ష్మి, అనపర్తి ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండలో పందులకు స్వైన్ ఫ్లూ

మృత్యువాత పడుతున్న వైనం



పశ్చిమ గానుగూడెంలో పందులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యాధికారి

మధురపూడి: కోరుకొండ మండలంలో పందులకు స్వైన్ ఫ్లూ సోకింది. 12 రోజులుగా వ్యాధి వ్యాప్తి చెందుతోందని పందుల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పటివరకు 40 పందులు మృతి చెందాయి. పశ్చిమ గానుగూడెం, సర్పాపురం, శ్రీరంగపట్నానికి చెందిన పందులను వాటి యజమానులు కోరుకొండ వరకూ తోలి విడిచిపెడుతున్నారు. దీంతో అన్నింటికీ వ్యాధి సోకుతోంది. ఇదిలాఉండగా వ్యాధి నివారణ కోసం వేయాల్సిన వ్యాక్సిన్‌ను పశ్చిమ గానుగూడెం, సర్పాపురం, శ్రీరంగపట్నంలోని 80 పందులకు పశు సంవర్ధక శాఖాధికారులు ఇచ్చారు. మండల కేంద్రమైన కోరుకొండలో పందుల యజమానులు సహకరించకపోవడంతో వ్యాక్సిన్ ఇవ్వలేదు. పందుల యజమానులకు నోటీసులు ఇచ్చినప్పటికీ వ్యాక్సిన్ వేయించడం లేదని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. వాటికి సోకిన స్వైన్ ఫ్లూ మనుషులకు సోకే ప్రమాదం ఉండొచ్చని స్థానికులు భయపడుతున్నారు.

అలరించిన ‘ఈ పాట మావూరి కోసం’



సినీ గీతం పాడుతున్న సత్యనారాయణ, అనిత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక విక్రమహాల్లో ఆదివారం ఘంటసాల మానవ సేవయే మాధవసేవ (పాటే ప్రాణం–సేవే మార్గం) సంస్థ ఆధ్వర్యంలో ఘంటసాల 49వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ‘ఈ పాట మావూరి కోసం’ అలరించింది. అలనాటి పాత, కొత్త పాటలను గాయనీగాయకులు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. సంస్థ అధ్యక్షుడు యూవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్నచౌదరి, కోశాధికారి ఎస్.కృష్ణారావుతో పాటు డాక్టర్ వట్టిగంగాకిషోర్, డాక్టర్‌బోడపాటి శ్రీనివాస్, సీహెచ్‌నవీన్, అనిత, భవ్యలు పాటలను ఆలపించారు. ఎస్ఆర్ ఇన్‌ఫ్రా బిల్డర్స్ అధినేత కోడేబత్తుల సత్యేంద్ర(నాని), జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అల్లు బాబి, మాజీ కార్పొరేటర్ ఏవీ రమణ సంస్థ సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న సుబ్బారావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని వెంకటగిరి బాపూజీనగర్‌లో సిద్ధూ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్(బొల్లినేని)హాస్పిటల్స్ సహకారంతో ది ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రూరల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు ప్రారంభించారు. కిమ్స్ వైద్య నిపుణులు 200 మంది రోగులకు ఈసీజీ, అవసరమైన వైద్యపరీక్షలు చేసి సిఫారసు చేసిన మందులను ఉచితంగా అందించారు. కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణరామ్మోహన్, బీఎంపీ రాష్ట్ర సంఘ గౌరవ సలహాదారు గౌరిష్‌బాబు పాల్గొన్నారు.

పోలీసులిచ్చిన అనుమతులపై చర్చకు సిద్ధమా?

మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లికి ఏఎంసీ చైర్మన్ సవాల్

అనపర్తి: ఈ నెల 17న అనపర్తిలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి పోలీసులు ఇచ్చిన అనుమతులపై చర్చకు సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం అనపర్తిలో జరిగిన గృహసారథుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తి పర్యటనలో కేవలం చంద్రబాబు రోడ్‌షోకు మాత్రమే పోలీసులు అనుమతులు ఇచ్చారన్నారు. బహిరంగ సభకు పోలీసులు ముందుగా అనుమతులు ఇచ్చి తరువాత అనుమతులు లేవని సభ జరగకుండా అడ్డుకున్నారంటూ చంద్రబాబుతో పాటు టీడీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పోలీసులు రోడ్‌షోకు అనుమమతి ఇచ్చారా లేక బహిరంగ సభకు అనుమతి ఇచ్చారా అన్న విషయమై ప్రజలకు నిజానిజాలు తెలియజేసేందుకు తాను బహిరంగ వేదికపై చర్చకు సిద్ధమని, మీకు ధైర్యం ఉంటే చర్చకు రావాలన్నారు. పోలీసులు రోడ్‌షోకు కాకుండా బహిరంగ సభ జరుపుకునేందుకు అనుమతి ఇచ్చారని మీరు నిరూపిస్తే తన పదవికి, పార్టీకి రాజీనామా చేస్తానన్నారు. నిరూపించలేకపోతే మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేసి, నియోజకర్గ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పుకోవాలని సవాల్ విసిరారు.

కేదారస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కేదారస్వామి ఆలయం వద్ద అర్చకులు స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటుచేసిన మహా అన్న సమారాధనను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి కలిసి ప్రారంభించారు. సుమారు 12 వేల మంది అన్న సమారాధనలో పాల్గొన్నారని ఆలయ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు గువ్వల సత్తిరెడ్డి, జంగా గంగధర్‌రెడ్డి, రామారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

టీబీ రోగులకు నిత్యావసరాల పంపిణీ



టీబీ రోగులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న అయ్యప్పరెడ్డి తదితరులు

అనపర్తి: స్థానిక రైజింగ్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో టీబీ రోగులకు పౌష్టికాహారం, నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డీఎల్ఏటీఓ ఇన్‌చార్జ్, డీఎంహెచ్ఓ డాక్టర్ వసుంధర పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సేవా సంస్థ వ్యవస్థాపకుడు నల్లమిల్లి ఆదిరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన పడాల అయ్యప్పరెడ్డి చేతుల మీదుగా టీబీ రోగులకు 25 కేజీల బియ్యం, గుడ్లు, నిత్యావసర వస్తువులు, వివిధ పౌష్టికాహార పదార్థాలు అందజేశారు. కార్యక్రమంలో టీబీ ట్రీట్‌మెంట్ సీనియర్ సూపర్‌వైజర్ బి.మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భూకంప బాధితుల కోసం ప్రార్థన



వాక్య సందేశాన్నిస్తున్న ఫాదర్ జోసఫ్ తంబి

మధురపూడి: టర్కీ, సిరియా దేశాల్లో భూకంపం బాధితుల కోసం ప్రత్యేకమైన ప్రార్థనలు చేయాలని ఆర్‌సీఎం చర్చి రెవరెండ్ ఫాదర్ జోసెఫ్ తంబీ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఫాదర్ జోసఫ్ తంబి మాట్లాడుతూ బాధితుల సహాయార్థమై అన్ని విధాలుగా సహకారాలు అందజేయాలన్నారు. దేశంలోని అన్ని చర్చిల ద్వారా సహకారాన్ని అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఉపదేశి బెల్లపు డేవిడ్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారిల సేవలు అభినందనీయం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



త్రిమూర్తి శివజయంతి మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా తదితరులు

ప్రకాశం నగర్ : సమాజంలో శాంతిని నెలకొల్పాలని బ్రహ్మకుమారీలు చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సిటీఆర్ఐ రోడ్డులోని భాస్కర్‌నగర్ బ్రహ్మ కుమారిల ఆధ్యాత్మిక కేంద్రంలో శివరాత్రి వేడుకల్లో భాగంగా బ్రహ్మకుమారి గీతా మాధురి ఆధ్వర్యంలో త్రిమూర్తి శివజయంతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈశ్వరియా బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో ప్రతి శివరాత్రికి ఏదో ఒక కార్యక్రమం చేపట్టి ప్రజలలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందిస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలోని 17 శాఖల ద్వారా ఆధ్యాత్మికతను పెంపొందించడం కోసం నిరంతరం కృషిచేస్తున్నారని కొనియాడారు. బీకే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

ప్రకాశం నగర్ : కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కేత అప్పారావు పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సోమాలమ్మ గుడి సెంటర్లో కేత అప్పారావు కేత తులసమ్మల స్తూపాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కేత అప్పారావు దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని నిరంతరం చెప్పేవారని గుర్తు చేశారు .రాజమండ్రిలో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు జరిపించడంలో ఆయన పాత్ర మరువలేనిదని కొనియాడారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి, కోంద్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి సప్పా రమణ పాల్గొన్నారు.

సురభికి జాతీయ సౌరభం

- భారత్ రంగ్ మహోత్సవంలో మెరిసిన ఏకైక తెలుగు నాటకం భక్త ప్రహ్లాద
- సెట్టింగ్‌లు, లైటింగ్, మ్యూజిక్‌తో రక్తి కట్టించిన సురభి కళాకారులు
- 102 జ్వరంతో ఉన్నా ప్రహ్లాదుడిగా నటించి, మెప్పించిన ఆరేళ్ల పర్ణిక



తండ్రి హిరణ్యకశిపుడు ఎదుట శ్రీహరిని కీర్తిస్తున్న ప్రహ్లాదుడు



హరిని కీర్తిస్తూ పద్యాన్ని ఆలపిస్తున్న ప్రహ్లాదుడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సురభి అంటేనే నాటకం... నాటకం అంటేనే సురభి అన్నంతగా పేరు సంపాదించుకుంది సురభి కుటుంబం. అందుకే నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) ఆధ్వర్యంలో భారత్ రంగ్ మహోత్సవంలో ప్రదర్శనకు వారి నాటకం ఎంపికైంది. రాజమహేంద్రవరంలోని శ్రీవేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో ఆదివారం నుంచి జరుగుతున్న థియేటర్ ఫెస్టివల్‌లో శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్ గ్రూప్ హైదరాబాద్ వారు భక్త ప్రహ్లాద నాటకాన్ని ప్రదర్శించారు.

నాలుగు వేల నాటకాలు వడపోత...

ఎన్ఎస్‌డీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జాతీయ స్థాయి నాటక ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈ ఏడాది రాజమహేంద్రవరంలో నిర్వహణకు ఎన్ఎస్‌డీ సుముఖత తెలపడంతో ఆదివారం నుంచి 23వ తేదీ వరకు వివిధ రాష్ట్రాల కళాకారుల నాటకాలు ప్రదర్శించనున్నారు. దేశవ్యాప్తంగా నాలుగు వేల నాటకాలను ఎన్ఎస్‌డీ బృందం పరిశీలించి వాటిలో ఉత్తమంగా ఉన్న వాటిని ఎంపిక చేస్తుంది. ఇప్పటి వరకు సురభి కళాకారులు తప్ప మరే ఇతర నాటక కంపెనీకి ఇటువంటి అవకాశం దక్కలేదు. తెలుగు వారి నాటకాలను సుమారు రెండువేల వరకు పరిశీలించి వాటిలో సురభి వారికి అవకాశం కల్పించారు.

ఇతర రాష్ట్రాల కళాకారులతో పోటీ ఎక్కువ

మన నాటకాలలో భావోద్వేగాలకు ప్రాధాన్యం ఇస్తాం. ఇతర రాష్ట్రాల నాటకాలలో లైటింగ్, టెక్నికల్ అంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. అందుకే వారితో తెలుగు నాటకం పోటీ పడలేకపోతోంది.

అలరించిన భక్త ప్రహ్లాద

సురభి జయచంద్ర దర్శకత్వంలో ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం వీక్షకులను అలరించింది. సెట్టింగ్‌లు, లైటింగ్, మ్యూజిక్‌తో నాటకాన్ని రక్తి కట్టించారు. నాటకం చూస్తున్నంత సేపు ప్రేక్షకులు వేరే లోకంలో విహరించారు. దర్శకుడిగానే కాకుండా హిరణ్యకశిపుడిగా నటించి సురభి జయచంద్ర మెప్పించారు. ప్రహ్లాదుడి పాత్రలో నటించిన పర్ణిక (ఆరు సంవత్సరాలు) 102 జ్వరంతో ఉన్నా తన నటనతో మంత్ర ముగ్ధులను చేసింది.

ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ డ్రామా అఫైర్స్ సంచాలకులు అభిలాస్ పిళ్లై, బెంగళూర్ ఎన్ఎస్‌డీ సెంటర్ డైరెక్టర్ వీణా శర్మ, ఏపీ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు, రాజమహేంద్రవరం సెంటర్ ఇన్‌చార్జి భూపతి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, డిప్యూటీ డీఈఓ దిలీప్‌కుమార్, విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఐదువేల నాటకాలు ప్రదర్శించాను



సురభి వారసుడిగా నేను ఇప్పటి వరకు ఐదు వేల నాటకాలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. భారత్‌రంగ్ మహోత్సవాలలో మూడుసార్లు ప్రదర్శనలు ఇచ్చాను. ఏ తెలుగు నాటకం కూడా ఇప్పటి వరకు భారత్ రంగ్ మహోత్సవానికి ఎంపిక కాలేదు. ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ కేంద్ర సంగీత నాటక అవార్డును 2016లో అందుకున్నాను.

– సురభి జయచంద్ర వర్మ, దర్శకుడు, కళాకారుడు

చిన్నప్పటి నుంచీ నటిస్తున్నా



నేను నాలుగోయేట నుంచే నాటకాలలో నటిస్తున్నాను. ఇప్పటి వరకు 200 ప్రదర్శనలు ఇచ్చాను. ప్రహ్లాదుడిగా చాలాసార్లు నటించాను. మా నాన్న, అమ్మ, అందరూ నాకు రోజూ పద్యాలు నేర్పిస్తారు. మేకప్ వేసుకుంటే నాలో తెలియని ఉత్సాహం వస్తుంది.

– ఆర్.పర్ణిక వర్మ, ప్రహ్లాద పాత్రధారిణి